మొత్తం ధాన్యం కొంటాం

- రైతులు ఆందోళనకు గురి కావద్దు
- ధాన్యం కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలి
- ప్రాధాన్యతా క్రమంలో ఎగుమతి చేయాలి
- రైతులు ఆందోళన చెందవద్దు
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ఐకేపీ నిర్వాహకులతో సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వెల్దుర్తి: శెట్‌పల్లిలో పీఏసీఎస్ గోదాంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మెదక్, మే 22 (నమస్తే తెలంగాణ): ధాన్యం నిల్వలను ప్రాధాన్యతా క్రమంలో ఎగుమతి చేయాలని ఇందిరా క్రాంతి పదం అధికారులను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ధాన్యం కొనుగోలు ఎగుమతి, దిగుమతుల లోటుపాట్లపై డీపీఎం, ఏపీఎంలు సీసీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో 108 ఐకేపీ కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు, అందులో 25 కేంద్రాలు కొనుగోళ్లు పూర్తి చేసుకుని, మూయబడ్డాయని తెలిపారు. కొన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని, లారీలు కొరత ఉన్నప్పటికీ లోకల్ సోర్స్‌ను ఉపయోగించి రవాణా చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, డీసీఎస్‌వో బ్రహ్మారావు, డీఎం సివిల్ సప్లయ్ హరికృష్ణ, డీసీవో కరుణ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఏటీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

తేమ లేకుండా జాగ్రత్త వహించాలి

వెల్దుర్తి, మే 22: కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని, త్వరితగతిన రైస్‌మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం మండలంలోని శెట్‌పల్లి, బండపోసాన్‌పల్లి గ్రామాల్లో పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ఉప్పులింగాపూర్‌లోని రైస్‌మిల్లులను పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు, తరలింపు, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శెట్‌పల్లిలో లారీలు రాక ధాన్యం పోవడంలేదని రైతులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన జేసీ వాహనాలు తీసుకురావాలని వాహన యజమానులను కోరారు. జేసీ వెంట తహసీల్దార్ తులసీరాం, ఆర్ఐ జయ భరత్‌రెడ్డి, ఏఈవో ఉత్తమ్‌కుమార్, పీఏసీఎస్ సీఈవో సిద్దయ్య, రైస్‌మిల్లర్లు ఉన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ

ఇంటర్ సప్లిమెంటరీకి ఏర్పాట్లు చేయాలి

- జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ

మెదక్ మున్సిపాలిటీ, మే 22: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ సూచించారు. ఈనెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులకు బుధవారం శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. నిమిషం నిబంధన వర్తిస్తుందన్నారు. జిల్లా పరీక్షణ కమిటీ సభ్యులు శశిధర్, అశోక్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రూ.500 బోనస్.. పెద్ద బోగస్సేనా..?

టేక్మాల్, మే 22: వరికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న రూ.500 బోనస్.. పెద్ద బోగస్ అని బీఆర్ఎస్ జిల్లా యూత్ కార్యదర్శి నాయికోటి భాస్కర్ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన మరో హామీని తుంగలో తొక్కిందన్నారు. ఎన్నికల ముందు వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, గెలిచాక మాట సన్న రకానికి మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, అది కూడా వచ్చే సీజన్‌కు ఇస్తామని చెప్పడం బాధాకరమని అన్నారు. ఈ సీజన్ నుండే బోనస్ అనువర్తించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

భగీరథ నీటిలో వానపాములు

నిజాంపేట, మే 22: ఇంటింటికీ నల్ల కనెక్షన్‌తో స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్న మిషన్ భగీరథ పథకం నీరుగారిపోతున్నది. బుధవారం నిజాంపేటలోని 6 వ వార్డులో అధికారుల నిర్లక్ష్యంతో మిషన్ భగీరథ నీటిలో వానపాములు దర్శనమిచ్చాయి. ఈ నీటిని తాగేందుకు, వంటలకు వాడుతుంటారు. ఇందులో వానపాములు రావడంతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమడవద్దని కాలనీవాసులు మండిపడ్డారు. వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకుని స్వచ్ఛమైన నీటిని అందించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

రామాయంపేట, మే 22: తూప్రాన్‌లోని గురుకులంలో అతిథి అధ్యాపకుల ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల ప్రిన్సిపాల్ పిబి.మురళి ఒక ప్రకటనలో బుధవారం పేర్కొన్నారు. గురుకులంలో ప్రవేశం కోసం అర్హులైన అధ్యాపకులు తమ దరఖాస్తులను ఈనెల 28నలోగా అందజేయాలన్నారు. గురుకులంలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు బోధన చేపట్టేందుకు తమ ధరఖాస్తులు అందజేయాలన్నారు. అభ్యర్థులు పీజీ, బీఈడీ కలిగిన వారై ఉండాలన్నారు. గురుకుల పాఠశాల, కళాశాలలో జువాలజీ, తెలుగు జేఎల్, మాథ్స్ ఎస్‌జీటి, మాథ్స్ టీజీటీ, హిందీ సబ్జెక్టుల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. వివరాలకు సెల్ 8688665770లో సంప్రదించాలన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

నిజాంపేట, మే 22: నిజాంపేటలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాలు జనుము 200 క్వింటాళ్లు, జీలుగ 200 క్వింటాళ్లు 60 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని ఏఈవో కావేరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమున్న రైతులు తమ పట్టా పాసు బుక్ జిరాక్స్‌ను దుకాణ సిబ్బందికి అందించి, పచ్చిరొట్ట ఎరువులు పొందవచ్చన్నారు.

గ్రామ దేవతలకు పూజలు

రామాయంపేట, మే 22: మండలంలోని ఝూన్సీలింగాపూర్‌లో గ్రామ దేవతలకు ఘనంగా బుధవారం పూజలు చేశారు. గ్రామంలో వారం రోజులుగా అన్ని దేవతలకు మంగళహారతులు, నైవేద్యాలు అందజేశారు. అనంతరం ఇంటింటికీ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ఒంటరిగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327722-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

జీవవైవిధ్యం విలువైన ఆస్తి : అదనపు కలెక్టర్ రమేశ్

మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ మున్సిపాలిటీ, మే 22: జీవవైవిధ్యం భవిష్యత్తు తరాలకు విలువైన ఆస్తి అని, విద్యార్థి దశ నుంచే సమాజానికి అవగాహన చేయాలని అదనపు కలెక్టర్ రమేశ్ పిలుపునిచ్చారు. జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో డీఈవో రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, విద్యాశాఖ కోఆర్డినేటర్ సుదర్శనమూర్తి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, విద్యార్థినులతో కలిసి జీవ వైవిధ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మానవ మనుగడ జీవవైవిధ్యంపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రకృతిని కాపాడుట కోసం నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉంటుందన్నారు. వాతావరణ, నీటి, శబ్ద కాలుష్యాలతో ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడి అకాల వర్షాలు, బ్యాక్టీరియా వైరస్ వ్యాప్తి చెందుతున్నాయన్నారు. అడవులు నరికివేతతో సకాలంలో వర్షాలు పడక పంటలు పండడం లేదని, మొక్కలు నాటి భూతాపాన్ని తగ్గించి జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలన్నారు. మొక్కలు నాటడంతో పర్యావరణ సమతూల్యత ఏర్పడుతుందన్నారు.

జీవ వైవిధ్యం సంరక్షణ అందరిది

మెదక్ మున్సిపాలిటీ, మే 22: జీవ వైవిధ్యంతోనే మానవ మనుగడకే సాధ్యమని, జీవవైవిధ్యాన్ని కాపాడటం మనందరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ అన్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడామిక్ కోఆర్డినేటర్ సుధాకర్, అధ్యాపకులు తిరుమల్‌రెడ్డి, శరత్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్

సాయిబాబా ఆలయానికి విరాళం


దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చేగుంట, మే 22: షిర్డీ సాయిబాబా ఆలయానికి చేగుంటలో నివాసముంటున్న ముస్లిం భక్తులు మహ్మద్ రఫిక్ దర్శనం కోసం వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ.రూ.50 వేలు, మహ్మద్ మొయినొద్దీన్ (టింకా) రూ.16 వేలు, గాండ్ల శ్రీనివాస్ రూ.21వేలను దేవాలయ అభివృద్ధికి విరాళాలను బుధవారం అందించారు. విరాళాలు అందించిన ముగ్గురు భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపకుడు అంబటి ఆంజనేయులు, కమిటీ సభ్యులు కాడిగిద్ద యాదిరెడి, వంటరి రాంరెడ్డి, ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ వంటరి కొండల్‌రెడ్డి, సిద్దిరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

చేపలు పట్టడానికి వెళ్లి వ్యక్తి మృతి

తలారి రాజు (ఫైల్)

చిలిపిచెడ్, మే 22: మంజీరా నదిలో చేపలు పట్టడానికి వెళ్లి వలలో చిక్కుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫైజాబాద్‌లో బుధవారం జరిగింది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫైజాబాద్ గ్రామానికి చెందిన తలారి రాజు(44) గ్రామ శివారులోని మంజీరా నదిలో చేపలు పడుతుండగా చేప వలలో చిక్కుకుని, మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గ్రామస్తుల సాయంతో మృతదేహాన్ని నది నుంచి బయటకు తీసుకొచ్చారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

క్రీడలతో శారీరక ధృఢత్వం

బహుమతులు అందజేస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

వెల్దుర్తి, మే 22: క్రీడలతో శారీరక ధృఢత్వం, మానసిక ప్రశాంతత కలుగుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని కుకునూర్ గ్రామంలో జరుగుతున్న క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. గెలుపొందిన జట్లకు ఆయన బహుమతులు అందజేశారు. క్రీడాపోటీలతో గ్రామీణ క్రీడాకారుల మధ్య స్నేహభావం పెరుగుతుందని రాజిరెడ్డి తెలిపారు. 28 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో తూప్రాన్ జట్టు విజేతగా, కొట్టాల జట్టు రెండో స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో కాంగ్రెస్ మండ ల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సెలవుల్లోనూ సరదా సదువులు


వల్లభాపూర్‌లోని వీధిగోడలపై వేసిన పెయింట్ అక్షరాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

చేగుంట, మే 22: అవును.. ఓ హెచ్ఎంకు వచ్చిన ఆలోచన. వేసవి సెలవుల్లో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు వీధుల్లో ఆడుకుంటూ, సరదాగా చదువు నేర్చుకుంటున్నారు. విద్యను మర్చిపోకుండా ఉండేందుకు చేగుంట మండలంలోని వల్లభాపూర్‌లో ఆ పాఠశాల హెచ్ఎం మెతుకు పరమేశ్వర్‌రెడ్డికి గ్రామంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న ఇంటి యజమానుల అనుమతితో పలు చోట్ల తెలుగు, హిందీ, ఇంగ్లిష్ వర్ణమాలతోపాటు గుణితపు గుర్తులు, గుణింతాలను గోడలపై రాయించారు. దీంతో గ్రామంలో ఎక్కడ చూసినా పాఠశాలగా తలిపిస్తున్నది. దీంతో అటుగా వెళ్లే విద్యార్థులు వేసవి సెలవుల్లోనూ గోడలపై రాసిన రాతలను చిన్నారులు చదువుకుంటున్నారు.

వల్లభాపూర్‌లోని వీధిగోడలపై వేసిన పెయింట్ అక్షరాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

నర్సాపూర్‌లో వృద్ధులకు మందులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, మే 22: మున్సిపాలిటీలోని విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో మల్లారెడ్డి దవాఖాన యాజమన్యం తరుపున బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ హాజరై వృద్ధులకు మందులు అందజేశారు. ప్రతి ఒక్కరూ వృద్ధులకు సాయపడాలన్నారు. కార్యక్రమంలో విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకురాలు అభర్ణ, మల్లారెడ్డి దవాఖాన వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో జంట మృతదేహాల కలకలం

ఘటనా స్థలం వద్ద వివరాలను సేకరిస్తున్న సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై పుష్పరాజ్

ఘటనా స్థలంలో మృతదేహాలు

నర్సాపూర్, మే 22: నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని రాయారావు చెరువు సమీపంలో జంట మృతదేహాలు కలకలం సృష్టించాయి. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్‌లోని రాయారావు చెరువు సమీపంలో చెట్ల పొదల మధ్యలో ఓ మహిళ, ఓ పురుషుడి మృతదేహాలు పూర్తిగా కలిపోయి ఉన్నాయి. అటువైపు వెళ్లిన ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. ఇద్దరిని ఎక్కడో చంపి నర్సాపూర్ చెరువు సమీపంలోని చెట్ల పొదల్లో తెచ్చి పెట్రోల్ పోసి కాల్చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాలు రెండు కూడా పూర్తిగా గుర్తుపట్టలేకుండా కుళ్లిపోయిన స్థితిలో ఉన్నాయి. నాలుగు రోజుల క్రితమే ఇద్దరిని చంపేసినట్లు భావిస్తున్నారు. చనిపోయిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనా స్థలానికి తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీమ్ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వివాహేతర సంబంధమా, లేక భూ తగాదాలతో ఇద్దరిని హత్య చేశారా అనే కోణంలో విచారణ ప్రారంభించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి

భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, మే 22: దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి చెందిన వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ అని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. భాగ్యరెడ్డివర్మ జయంతిని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేశ్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి నాగరాజగౌడ్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి పాల్గొన్నారు.

పెట్రోల్ తక్కువ వస్తున్నదని ఆందోళన

శివ్వంపేట అంజన పెట్రోల్ బంకులో ఆందోళన చేస్తున్న వినియోగదారులు

శివ్వంపేట, మే 22: శివ్వంపేటలో అంజన పెట్రోల్ బంకులో పెట్రోల్ తక్కువగా వస్తున్నదని వినియోగదారులు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొందరు యువకులు పెట్రోల్ పోయించుకునేందుకు అంజన పెట్రోల్ బంకుకు వచ్చి బైకుల్లో పెట్రోల్ పోయించుకున్నారు. పెట్రోల్ తక్కువగా వచ్చిందని, రీడింగ్‌లో ఏదో మోసం ఉన్నదని వినియోగదారులు గ్రహించారు. సదరు యువకులు వెంటనే పెట్రోల్ బంకులో ఉండే జారులో ఒక లీటర్ పెట్రోల్ పోయించి తనిఖీ చేపట్టారు. కాగా అందులో 60 మిల్లీలీటర్లు తక్కువగా రావడంతో వినియోగదారులు బంకు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఈ విషయాన్ని పెట్రోల్ బంకు యజమాని దృష్టికి తీసుకెళ్లగా ఆయన నిర్లక్ష్యపు సమాధానం చెప్పారు. మోసాలకు పాల్పడుతున్న బంకు యాజమాన్యంపై ఉన్న తాధికారులు చర్యలు చేపట్టాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

పావని (ఫైల్)

వెల్దుర్తి, మే 22: పొలం విక్రయించిన డబ్బు ల విషయంలో ఇంట్లో తరుచూ గొడవలు జరగడంతో మనస్తాపానికి గురైన యువతి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లోని వెల్దుర్తి పంచాయతీ శేరీల గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన కౌడె శ్రీను, యాదమ్మలకు ముగ్గురు కూతుళ్లు. ఇద్దరికి వివాహం జరిగింది. మూడో కూతురు పావని(18) ఉంది. గత కొద్ది రోజుల క్రితం శ్రీనుకు చెందిన పొలం విక్రయించగా వచ్చిన డబ్బులను తమకు ఇవ్వాలని శ్రీను తల్లిదండ్రులు బాలమ్మ, నర్సయ్యతోపాటు వారి అక్క చెల్లెలు మంజు ల, లింగమ్మ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన పావని బుధవారం ఇం ట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయాన్ని వెల్దుర్తి పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

ఘనంగా బండ్ల ఊరేగింపు

అల్లాదుర్గం, మే 22: మండలంలోని గడిపెద్దాపూర్‌లో మల్లికార్జున స్వామి జాతర ఘనంగా కొనసాగుతున్నది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం బండ్ల ఊరేగింపు నిర్వహించారు. బండ్లను రంగురంగులతో అందంగా అలంకరించి భాజాభజంత్రీలతో స్వామివారిని ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. 23న లంకాదహనం, 24 పాచి బండ్ల ప్రదక్షిణ ఉంటుందని తెలిపారు.

దుర్గామాతకు బోనాలు

పెద్దశంకరంపేట, మే 22: మండలంలోని చీలపల్లి గ్రామంలో దుర్గామాత జాతరలో భాగంగా బుధవారం మొదటి రోజు బోనాలు ఊరేగించారు. గ్రామంలో మహిళలు బోనాలు ఎత్తుకుని శివసత్తుల నృత్యాలు, బ్యాండుమేళాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి దుర్గామాతకు ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.